## తాండ్ర్యాలలో బస్సులు ఆపండి

- రోడ్డెక్కిన గ్రామ మహిళలు



తాండ్ర్యాలలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

కథలాపూర్, జూన్ 16 : తాండ్ర్యాలలో ఆర్టీసీ బస్సులు ఆపాలని ఆ గ్రామ మహిళలు రోడ్డెక్కారు. తాండ్ర్యాల మీదుగా గంభీర్‌పూర్‌కు బస్సులు వెళ్తున్నా ఆపడం లేదని ఆగ్రహించారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. తమ గ్రామంలో బస్సులు ఆపకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాండ్ర్యాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వారం క్రితం కోరుట్ల డిపో అధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందన కరువైందని మండిపడ్డారు. ధర్నా చేస్తున్న విషయం తెలియడంతో ఆర్టీసీ అధికారులు గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడారు. గంభీర్‌పూర్‌కు బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచి, తాండ్ర్యాలలో బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

---

వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా దుకాణాలు, నివాసాలను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్



వేమలవాడ రాజన్న ఆలయ పరిధిలో రోడ్డు విస్తరణ పనులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము విస్తరణకు వ్యతిరేకం కాదని, బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా తమకు పరిహారం చెల్లించి కూల్చివేయాలంటూ వ్యాపారులు చేసిన విన్నపాలు బుట్టదాఖలయ్యాయి. తహసీల్దార్ నుంచి పైస్థాయి అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి అర్థించినా చివరకు అధికారులు అనుకున్నదే చేయడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి ఇంకా చాలా మంది పరిహారం తీసుకోకపోగా, కొంత మంది కోర్టును ఆశ్రయించారు. వీటిని పరిష్కరించకుండానే సోమవారం తెల్లవారుజామునుంచే పోలీసుల పహారా మధ్య కూల్చివేతలు సాగించడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు.

ఇంటి సామగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనం

షాప్ ఖాళీ చేసి సామగ్రిని ట్రాలీ ఆటోలో ఎక్కిస్తున్న వ్యాపారి









దగ్గరుండి ఇంటిని ఖాళీ చేయిస్తున్న పోలీసులు

బందోబస్తులో పోలీసులు



షాపు బయట సామగ్రిని పెడుతున్న వ్యాపారి



కూల్చివేసిన జనశక్తి రాజన్న ఇల్లు

# దూసుకొచ్చిన ఎక్స్‌కవేటర్లు..

# బిక్కుబిక్కుమన్న వ్యాపారులు

- వేములవాడలో ప్రధాన రహదారి విస్తరణ తీరుపై విమర్శలు
- తెల్లవారక ముందే దుకాణాలు, నివాసాలపైకి బుల్డోజర్లు
- దారి పొడవునా పోలీస్ పహారా.. పది ఎక్స్‌కవేటర్లు
- ఖాళీ చేసేందుకు సమయం ఇవ్వాలన్నా వినకుండా కూల్చివేతలు
- సామగ్రితో రోడ్డుపై వాహనాల కోసం పడిగాపులు
- పరిహారం ఇవ్వకుండానే కొందరిని ఖాళీ చేయించిన అధికారులు?
- జనశక్తి రాజన్న, అరుణోదయ సాంస్కృతిక అధ్యక్షురాలు విమలక్క ఇల్లు నేలమట్టం!

**అది సోమవారం ఉదయం 6 గంటలు.. వేములవాడ మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి.. దారిపొడవునా మోహరించిన పోలీసులు, ఇతర శాఖల అధికారులు, ఎక్స్‌కవేటర్లు.. కట్టుదిట్టమైన బందోబస్తు మధ్యన రోడ్డు విసర్తణ పనులు మొదలు కాగా, నిర్వాసితులు బిక్కుబిక్కుమన్నారు. దుకాణాలు, నివాసాలు ఖాళీ చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని అర్థించినా వినకుండా కూల్చివేతలు ప్రారంభించడంతో సామగ్రిని పట్టుకొని రోడ్డు మీద వాహనాల కోసం పడిగాపులు గాశారు.**



వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా షాపులు, నివాసాలను కూల్చి వేస్తున్న ఎక్స్‌కవేటర్లు

### అందని పరిహారం ?

80 అడుగుల రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించిన అధికారులు, ఆ మేరకు 243 మంది నిర్వాసితులకు నోటీసులు ఇచ్చారు. అందులో కొంత మందికి మాత్రమే పరిహారం అందగా.. మెజార్టీ బాధితులు తమకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరుతూ వస్తున్నారు. ఇదే విషయాన్ని రాతపూర్వకంగా అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ఇచ్చారు. ఏళ్ల తరబడిగా వ్యాపారం చేసుకొని జీవిస్తున్నామని, ఒక్కసారిగా తమ భవనాలు కూల్చివేస్తే తాము రోడ్డున పడుతామని, అందుకే తమకు పరిహారం ఎక్కువ ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. తాము విస్తరణకు ఏమాత్రం వ్యతిరేకం కాదని చెప్పారు. అయినా, అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో దాదాపు 88 మంది హైకోర్టును ఆశ్రయించినట్టు తెలుస్తున్నది.

కరీంనగర్, జూన్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆంక్షలు.. పోలీస్ పహారా మధ్య వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. మూల వాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య సాగాయి. మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన మటన్ మార్కెట్‌ను ఆదివారం కూల్చివేసిన అధికారులు.. సోమవారం ఉదయం నుంచే నిర్వాసితుల నివాసాలు, దుకాణాలను కూల్చివేశారు. గుర్తించిన భవన, దుకాణం యజమానులు వారి వారి భవనాలను ఖాళీ చేయాలంటూ పదిహేను రోజుల క్రితం నోటీసులు జారీచేసి, గడువు ముగిసిన మరుసటి రోజు నుంచే రంగంలోకి దిగారు. ఉదయం 6 గంటలకే అధికారులు, పోలీసులు భారీగా మోహరించారు. మొత్తం 10 బృందాలతో పది ఎక్స్‌కవేటర్లు, వాహనాలతో అమరవీరుల స్తూపం నుంచి మొదలుకొని ఆలయం వరకు కూల్చివేతలను ప్రారంభించారు. ఒక్కో తహసీల్దార్‌కు ఒక్కో ప్రాంతానికి ఇన్‌చార్జిగా అప్పగించి కూల్చివేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించారు. దుకాణాలు ఖాళీ చేసేందుకు కొంత సమయం కావాలని వ్యాపారులు వేడుకున్నా ఎలాంటి గడువు ఇవ్వకుండా కూల్చివేశారు. గంట సమయం మాత్రమే ఇస్తామని, ఈలోగా ఖాళీ చేసుకుంటే తామే వాహనాన్ని సమకూర్చుతామని చెబుతూనే.. తమ మాట వినకపోతే దుకాణాలను ఖాళీ చేస్తామని హెచ్చరించారు. ఇదిలా కొనసాగుతుండగానే.. ఒక్కసారిగా కూల్చివేతలు ప్రారంభం కావడంతో దుకాణాలు, నివాసాలను నిర్వాసితులు బిక్కుబిక్కుమంటూ సర్దుకుంటూ ఖాళీ చేయాల్సి వచ్చింది. మరోవైపు వస్తువులన్నీ ఎక్కడికక్కడ రోడ్డు మీద పెట్టుకొని వాహనాల కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధాన రహదారి విస్తరణ పూర్తిగా పోలీస్‌మయంగా మారింది. అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో అమరవీరుల స్తూపం నుంచి రాజన్న ఆలయం వరకు దాదాపు 200 మంది పోలీసులను మోహరించారు. ఎక్కడికక్కడ పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య సిబ్బందిని కూడా విధి నిర్వహణలో ఉంచారు. వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారిలో జరిగిన కూల్చివేతలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ వారు పరిశీలించారు. జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు.

### విమలక్క ఇల్లు నేలమట్టం

ఐదు దశాబ్దాల పాటు ఈ ప్రాంతంలో దున్నేవాడికే భూమి దక్కాలని పోరాటం చేసిన జనశక్తి కేంద్ర కమిటీ కార్యదర్శి కూర రాజన్న, రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ అలియాస్ అమర్, అరుణోదయ సాంస్కృతిక అధ్యక్షురాలు విమలక్కకు చెందిన నివాసాలు రోడ్డు విస్తరణలో నేలమట్టమయ్యాయి. వీరు ఉద్యమ బాట పట్టినప్పటికీ రాజన్న తల్లి కూర మల్లమ్మ 2019లో మృతి చెందే వరకు ఇదే ఇంట్లో ఉంది. ప్రస్తుతానికి ఆ నివాసాన్ని పక్కన ఉన్న బంధువులు వినియోగించుకుంటున్నారు. రహదారి విస్తరణలో వీరి నివాసం మొత్తం నేలమట్టమైంది. పరిహారం అందకుండానే వీరి నివాసం నేల మట్టం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం విమలక్కతో పాటు ఇతరులు కూల్చివేసిన ఇంటి వద్దకు వచ్చే అవకాశమున్నట్టు సమాచారం.

---



జగిత్యాల జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

# బెదిరింపులకు భయపడం

- కలిసికట్టుగా ఎదుర్కొంటాం
- కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది
- రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



కుంకుమ పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల, జూన్ 16, (నమస్తే తెలంగాణ)/ మల్యాల : కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, సర్కారు అక్రమాలపై తాము ప్రశ్నిస్తున్నామని, అందుకే ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. అయినా మీ బెదిరింపులకు భయపడేదిలేదని స్పష్టం చేశారు. తమ పార్టీ లోపాలను సవరించుకుంటామని, తమ మీద ఎవరైనా దాడికి వస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. సోమవారం ఆమె జగిత్యాలలో పర్యటించారు. జిల్లా కేంద్రంలోని నవదుర్గ ఆలయం రెండో వార్షికోత్సవం సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, స్థానిక మహిళలతో కలిసి కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం తమ బీఆర్‌ఎస్ ఎంపీ దామోదర్‌రావు ఎంపీ లాడ్స్ నుంచి ₹90 లక్షలు ఇచ్చారని, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మరో ₹10 లక్షలు ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం మీడియాతో కల్వకుంట్ల కవిత మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేక రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతు భరోసా అని రైతులను, స్కూటీలు అని యువతులను, జాబ్ కాలెండర్ అని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. వృద్ధులు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్లు పెంచుతామని చెప్పి ఇంతవరకు పెంచలేదని, మహిళలకు ₹2,500 ఇవ్వలేదని ఆగ్రహించారు. హామీలు అమలు చేసేదాకా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చి వేధింపులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. అయినా తాము వేధింపులకు భయపడేవాళ్లం కాదని స్పష్టం చేశారు. కేటీఆర్ విచారణ సందర్భంగా ఈ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఉన్న తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో తమ కార్యకర్తలు, నాయకులు బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గట్టు సతీశ్, దామోదర్‌రావు, ఆనంద్‌రావు, శీలం ప్రియాంక, అనురాధ, దావ సురేశ్, తదితరులు పాల్గొన్నారు..



తెలంగాణ భవన్ వద్ద పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



సిరిసిల్ల టౌన్: హైదరాబాద్‌కు తరలిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

# రామన్నకు అండగా గులాబీ దళం

- హైదరాబాద్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి మద్దతు

పెద్దపల్లి, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గులాబీదళం అండగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదంటూ వెన్నంటి నడిచింది. ప్రతీ క్షణం ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న కేటీఆర్ వెంట తామున్నామంటూ మద్దతు తెలిపింది. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ ఎదుట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం హాజరైన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, సిరిసిల్ల, వేములవాడ, పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలు నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ సొసైటీ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు కొండూరి రవీందర్‌రావు, చల్మెడ లక్ష్మీనరసింహారావు, జిందం చక్రపాణి, బండ శ్రీనివాస్, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, సిద్ధం వేణు, తదితరుల ఆధ్వర్యంలో వందలాది బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. తెలంగాణ భవన్ వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని మరిచి కుటిల రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కుట్రలు, బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలుచేయాలని ప్రశ్నిస్తే బీఆర్‌ఎస్ నాయకులను బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నోటీసులు, విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని తెలిపారు. ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ప్రతిపక్ష హోదాలో ప్రశ్నిస్తూనే ఉంటామని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఇటు కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై జిల్లాల్లోనూ నిరసనలు తెలిపారు. ఓదెలలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.



ఓదెల: ఓదెలలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మంథని : తెలంగాణ భవన్‌లో కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, బీఆర్‌ఎస్ నాయకులు